# ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటు హక్కు వినియోగంపై మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య

- అత్యంత విలువైనది ఓటు
- జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య

జనగామ చౌరస్తా, అక్టోబర్ 17 : ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జనగామ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద ఓటు హక్కు, వినియోగంపై స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో అత్యంత విలువైంది ఓటు హక్కు అని తెలిపారు. ఓటు హక్కుపై అందరూ అవగాహన కలిగి ఉండి, ఓటును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఉన్న జనగామ, చేర్యాల, తొర్రూరు మున్సిపాలిటీల్లోనూ ఓటు హక్కుపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల ప్రకారం ఓటు హక్కు వినియోగంపై స్వీప్ యాక్టివిటీస్‌తో పాటు సోషల్ మీడియా ద్వారా జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక సారథి కళా బృందం ఆధ్వర్యంలో ఓటు హక్కుపై తమ మాటలు, పాటలతో చైతన్యం చేశారు.

### పోలింగ్ కేంద్రాలు తనిఖీ

జిల్లా కేంద్రంలోని జనగామ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంతో పాటు అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో స్ట్రాంగ్ రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే గదులను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఎటువంటి లోటు లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ రజిత, డీపీఆర్వో రాజేంద్ర ప్రసాద్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీ కృష్ణ, స్వీప్ నోడల్ అధికారి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తపాలా శాఖ ఎస్పీ హన్మంతు

## పోస్టాఫీస్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

దేవరుప్పుల, అక్టోబర్ 17: తపాలా శాఖ ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పొదుపు పథకాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ హనుమకొండ డివిజన్ ఎస్పీ వీ హన్మంతు అన్నారు. మండలంలోని నీర్మాల గ్రామంలో మంగళవారం పోస్టల్ శాఖ పలు పొదుపు పథకాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ పోస్టల్ శాఖ చిన్న మొత్తాల పొదుపు పథకాలు, తక్కువ రేటుతో కూడిన ఇన్సురెన్స్ ప్రజలకు అందుబాటుతో ఉంచిందన్నారు. ప్రధానంగా వ్యవసాయ, గీత, హమాలీ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకాల్లో చేరి లబ్ధి పొందాలని కోరారు. అలాగే పోస్టాఫీసుల్లో సేవింగ్స్ బ్యాంకు ఖాతా, రికరింగ్ డిపాజిట్, టర్మ్ డిపాజిట్, మహిళా సమ్మన్ సేవింగ్ సర్టిఫికెట్, కిసాన్ వికాస పత్రం అందుబాటులో ఉన్నాయని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరోవైపు ప్రధానంగా 10 సంవత్సరాల లోపు బాలికలకు సుకన్య సమృద్ధి ఖాతా ఉందని ఇది బాలికల బంగారు భవిష్యత్తుకు బాట వేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం రూ. 399 చెల్లిస్తే రూ. 10 లక్షల బీమా సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకాలన్నీ తమ ఊరిలోని పోస్టాఫీసుల్లో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ ఈస్ట్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పీ అశోక్ కుమార్, సబ్‌పోస్ట్ మాస్టర్ నర్సింహులు, మెయిల్ ఓవర్సియర్ భాస్కర్, స్థానిక బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ యాదగిరి, నవాబుపేట బ్రాంచ్ పోస్టాఫీసు పరిధి సిబ్బంది పాల్గొన్నారు.

## జనగామ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం

- ప్రజలకు కృతజ్ఞతలు
- ఎంపీపీ కళింగరాజు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కళింగరాజు

జనగామ రూరల్, అక్టోబర్17: సీఎం కేసీఆర్ సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభను జనగామ మండల ప్రజలు విజయవంతం చేశారని ఎంపీపీ మేకల కళింగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని శామీర్‌పేట గ్రామంలోని కాళోజీ చౌరస్తాలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జనగామలో ఎప్పుడు ఇలాంటి సభ జరుగలేదని, భారీ సంఖ్యలో జనం వచ్చారన్నారు. సీఎం కేసీఆర్ ప్రసంగం, పల్లా అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ప్రజలు సభకు రావడానికి ఆసక్తి చూపించారన్నారు. ఎక్కడ చూసినా జనంతో రోడ్లు, సభ ప్రాంగణం నిండిపోయిందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి జనం స్వచ్ఛందంగా తరలి వచ్చారన్నారు. మరోసారి జనగామ గడ్డపై బీఆర్‌ఎస్ జెండా ఎగురడం ఖాయమన్నారు. సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొమ్ము జగదీశ్, చాట్ల డానియల్, తొట్టె కుమార్, తాండ్ర నాగరాజు పాల్గొన్నారు.

## 'పల్లా' గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం..

బచ్చన్నపేట, అక్టోబర్ 17 : జనగామ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని మండలంలోని పడమటికేశ్వాపూర్‌కు చెందిన జంగిటి రాజు అన్నారు. ఆయన సోమవారం సీఎం కేసీఆర్ సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయనకు సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన గ్రామంలో ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గోపాల్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్‌లో 45 ఏండ్లు పని చేసిన పొన్నాలకు సముచిత స్థానం కల్పించ లేదన్నారు. అందుకే ఆయన సారథ్యంలో తాను కాంగ్రెస్‌ను వీడినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పల్లా గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తామన్నారు. పని చేసే ప్రభుత్వంలో తాము భాగస్వాములు అవుతామన్నారు.

# కాల్వ ఏర్పాటుకు రైతులు సహకరించాలి

## అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్


రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 17: జిల్లాలోని 19 గ్రామాల రైతులకు ఉపయోగ పడే వరద కాల్వ ఏర్పాటుకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్ రైతులను కోరారు. మంగళవారం మండలంలోని చాగల్లు రైతు వేదికలో స్టేషన్ ఘన్‌పూర్, చిల్పూర్, రఘునాథపల్లి, జఫర్‌గఢ్ మండలాల రైతులతో గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించేందుకు శ్రీరాం ప్రాజెక్ట్ గౌరవెళ్లి రిజర్వాయర్ నుంచి కుడి కాల్వను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కాల్వ ద్వారా పై మండలాల్లోని 19 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. కాల్వ నిర్మాణం కోసం కొంత భూ సేకరణ చేశామని, ఈ మండలాల్లో చేయాల్సి ఉందన్నారు. కాల్వ నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వనున్నట్లు అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునీత, ఇరిగేషన్ ఈఈ వెంకటకృష్ణరావు, డీఈలు సుధాకర్, వీరభద్రయ్య, జేఈలు హర్షవర్ధన్, సుభాష్, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ పోగుల సారంగపాణి, రైతులు పాల్గొన్నారు.


ఉత్తమ సేవారత్న పురస్కారం అందుకుంటున్న అభినాష్

## అభినాశ్‌కు ఉత్తమ సేవారత్న పురస్కారం

జనగామ, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : లింగాలఘనపురం మండలం చీటూరుకు చెందిన కొత్తపల్లి అభినాశ్‌కు 2023 సంవత్సరానికి ఉత్తమ సేవారత్న పురస్కారం లభించింది. మంగళవారం హైదరాబాద్‌లోని బీసీ సాధికారిక భవన్‌లో నాయీబ్రాహ్మణ జనసంస్థ అధ్యక్షుడు మురహరి శ్రీధర్ ఆధ్వర్యంలో పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు సూర్యపల్లి సారంగపాణి, ప్రొఫెసర్ సావిత్రి, కవి రాపోలు సుదర్శన్, పారిశ్రామికవేత్త రాంబాబు చేతులమీదుగా అభినాశ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ లింగం, సినీనటులు రాంభీ, చేర్యాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన హమాలీ సంఘం సభ్యులు

## హమాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక

దేవరుప్పుల, అక్టోబర్ 17: కడవెండిలో ఏఐటీయూసీ హమాలీ సంఘం కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీడి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా మేడబోయిన భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా మైనాల అశోక్, సహాయ కార్యదర్శిగా దొటిక భిక్షపతి, కోశాధికారిగా బాషిపాక కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ హమాలీల హక్కుల సాధనకు కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం నుంచి అందే ప్రతి లబ్ధిని హమాలీలకు అందేలా చూస్తానన్నారు.

## కార్మికుల డబ్బులు విడుదల చేయాలి


డిప్యూటీ లేబర్ కమిషనర్ రమేశ్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న రాజారెడ్డి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 17 : భవన నిర్మాణ కార్మికుల బ్యాంకు ఖాతాలో జమై ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులను బ్యాంకర్లు వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి కోరారు. మంగళవారం వరంగల్ డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎస్ రమేశ్‌బాబుకు వినతిపత్రం సమర్పించినట్లు రాజారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంకుల్లో 300 మంది కార్మికుల ఖాతాలో జమ అయి ఉన్న డబ్బుల విడుదలకు బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, అజయ్, దత్తు, సీతారాం నాయక్ పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 17: దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా డివిజన్ కేంద్రంతో పాటు శివునిపల్లిలో చండికా అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. స్టేషన్ ఘన్‌పూర్ ఉత్సవ కమిటీ నిర్వాహకుడు గన్ను ఉమాశంకర్, భవాని భక్తులకు అన్నదానం నిర్వహించారు.


శివునిపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు